


# ఆ గజదొంగ ఎవరు?

చిల్లరిగె స్వరాజ్యలక్ష్మి

అనగా - అనగా - ఒకదేశం. ఏదేశం? అని అడగకండి. ఏ దేశం అయితేనేం? "పేరులోన నేమి పెన్నిధి యున్నది? అని గురజాడవారి గిరీశం తెనిగించాడు కాబట్టి. ఒకానొక దేశం అనిమాత్రం అందాం. ఆ దేశం ఏలే రాజు-దశరథ మహారాజుకి మల్లేనే ముగ్గురు భార్యలు; ముగ్గురికీ ముగ్గురు కొడుకులు పుట్టి పెరుగుతున్నారు. ఇంత మట్టుకే మన కథకీ రామాయణానికీ సాపత్యం. దశరథపుత్రులు ఉత్తములు; ధర్మమార్గానుసారులు. ఈ కథలో అన్నదమ్ములు దాశరథులంత సన్మార్గులు కారు. తండ్రిని ఖైదులో పెట్టి, అన్నదమ్ముల్ని హతమార్చి, రక్త సిక్త హస్తాల్తో సింహాసనం ఎక్కిన ఔరంగజేబంతటి దుర్మార్గులూ కారు. కాని స్వార్థంతో ఎవరిమట్టుకు వారే-తండ్రి అనంతరం దేశానికి రాజు కావాలనే అభిలాషతో ఉవ్విళ్లూరుతున్నారు.

తండ్రిగారికి సుస్తీచేసింది; వారం రోజుల పాటు మంచంమీంచి లేవలేదు. ఇంకేం వుంది? రాజుగారు మనలో వారు కారు; ఇహ బతికరు; చచ్చిపోతారు; తరవాత వారసులు ఎవరవుతారో! ఎవరు ఏల్తారో ఈ రాజ్యం? అని గుసగుసలు ప్రారంభం అయినవి. రాజముద్రిక ఎవరు అంకించుకుంటే వారే అనంతరమందు రాజు కాగలరు! అని పట్నంలో అనుకుంటున్నారు.

మూడో నాటికి జబ్బు ఇంకా యెక్కువ అయినది. నాలుగో రోజు ఎలా తెల్లారుతుందా అని ప్రజలు తహతహలాడుతున్నారు. కఫ వాతాల ప్రకోపం ఎక్కువగానే వున్నది. రాజవైద్యులు కుప్పెలు తెగ గోసి పోస్తున్నారు. ఆవేళ మహారాజుగారికి వంటిమీద తెలివీ తేటా ఏమీ లేవు. అదో మగతగా పడుకున్నారు. కన్ను విప్పలేదు, చూడలేదు.

ఎలాపోయిందో - ఏవిటోగాని - ఆవేళ రాజముద్రిక పోయింది; పోవడం రూఢే. అంతఃపురంలో మహారాణులో, కొడుకులో, పరిచారకులో - ఎవరు అంకించుకున్నారో - ఏమో కాని ముద్రికమాత్రం కనబడకుండా పోయింది. దొరకలేదు. ఎక్కడ వెతకడం? ఎవరి ననడం? ఎవరి నడగడం? అంతా ఘరానా మనుష్యులే. ఎవరా గజదొంగ? ఎవరిని అనుమానించడానికైనా సావకాశం ఏదీ? ఐదో నాటికి రాజుగారి జబ్బు మళ్లీనది. మాంద్యంపోయి తెలివి వచ్చినది. కొత్త నీరసం తప్ప మరేమీ జబ్బులేదు, రాజవైద్యులు నడిపించిన దివ్యౌషధ ప్రభావంవల్ల నీరసంకూడా తగ్గింది. రాజ్యపరిపాలన రాజుగారు మళ్లీ స్వయంగా చూచుకొంటున్నారు.

కాని రాజాజ్ఞలను ధ్రువపర్చే రాజముద్రిక మాయమైనదే! పోనీ మరోముద్రిక తయారుచేయించ కూడదా? అంటే — అసలుముద్రిక దొంగిలించిన దొంగ — రాజాజ్ఞకు వ్యతిరేకంగా తప్పటాజ్ఞలు వ్రాయించి అసలుముద్రిక వేసి పంపిస్తూ వస్తే పరిపాలన వ్యవహారం అంతా చిందరవందర అవుతుందే! కూటపత్రాలు - కూటఆజ్ఞలూ నెడలితే రాజకీయం స్తంభించిపోదా? ఆ ప్రమాదం తప్పించుకోడం యెలాగ? దాని జాడ తీసి పట్టుకోవాలి; గత్యంతరం కనబడలేదు. అంతరంగికంగా మహారాజావారు, మంత్రులు, కొత్వాలు, అనుభవశాలులు-సభచేసి, ఒక కథకుని పిలిపించడానికి నిశ్చయించారు. అతడు వయోవృద్ధుడు, ప్రజ్ఞాశాలి, ధీమంతుడు, ఇంగితజ్ఞుడు, మనశ్శాస్త్రవేత్త, చమత్కారంగా కథలు చెప్పే కథకుడు-ఆయనను పిలిపించి నిండుసభలో రమ్యమైన కథ ఒకటి చెప్పించారు. సభాభవనంలో ఉత్తరపు తట్టు స్త్రీలకోసం ప్రత్యేకించి పరదాలు కట్టేశారు. మహారాణులు, పండువంటి

పుణ్యస్త్రీలు, పౌరస్త్రీలు—250 మంది సభను అలంకరించారు. మహారాజావారూ - మంత్రులు-సిబ్బందంతా మామూలుగా కూర్చున్నారు. విద్యావంతులూ, వయోవృద్ధులూ, యువకులూ-యోధవీరులూ అంతా దక్షిణం వైపు ఆసీనులైనారు. ఇటువంటి మాన్య సభలో ప్రాజ్ఞకథకుడు శ్రావ్యకంఠంతో, గంభీర వాక్కులలో ఈ క్రింది కథ వివరించారు.

"కల్యాణ పట్టణం ఏలుతున్న మహారాజు గుణసముద్రుడు. నిజంగా గుణసముద్రుడే-ఆయనకు ఒక పుత్రికా రత్నం. భద్రావతి. సంగీత సాహిత్య విద్యలు-షట్ శాస్త్రాలూ-అన్నీ నేర్చుకున్న అపరసరస్వతి-సౌందర్యం. శరీరం కుందనచ్ఛాయ, వదనం సౌందర్యసదనం, పిక్కలు తాకే నీలపు కురులు, ఆకర్ణాంత విశాల నేత్రాలు. శ్రీకారయుక్త కర్ణములు. ఆకర్ణాంత విశాల నేత్రాలు. దొండపండు మోవి-కంబుకంఠం యౌవనం పొంగిపొరలుతున్న సుందరదేహం, సుశ్రోణి, ఇవన్నీ ఎందుకు - నిలకడకన్న తొలకరి మెఱుపు, సానబట్టిన మకరాంకు శస్త్రం అనిపించుకునేట్టు ఆమె తయారైనది. వివాహం సంకల్పించారు. చదువు ముగించి, గురుదక్షిణ యిచ్చి అంతఃపుర ప్రవేశానికి గురువనుజ్ఞ కోరి ఆమె గురువుగారింటికివచ్చి, పంచలచాపులూ - ఉత్తరీయాలు, దుశ్శాలువలు, రజితపాత్రలూ, స్వర్ణాభరణాలు అన్నీ పట్టించుకొనివచ్చి, దక్షిణ తాంబూలాలు ఇచ్చి, నమస్కరించి సెలవు అడిగింది. చేతులు జోడించి, నిలబడిఉన్నది. గురువుగారు వృద్ధులే-అయితేనేం? దశరథుడు, కైకను చూసి కరిగి ద్రవించిపోయాడు. రాజపుత్రిక సౌందర్యమునకు వశుడై, తన అభిప్రాయం ఆమెతో చెప్పే ధైర్యం చాలక గురువు గుక్కిళ్లు మింగుతున్నాడు. బాలికామణి విశాల హృదయం కలది. "గురువరా? మీ మనస్సు ఎందుచేతనో గాని సంతుష్టి చెందలేదు. దక్షిణ చాలలేదా? వస్త్రాభరణములు బాగులేవా? దేనిమీదనో మీకు అభిలాష కలిగినట్లు కనపడుతున్నది. సంశయించక మీ అభీష్టం నాకు ధారాళంగా విప్పి చెప్పండి - ఏమైనా, ఎట్టిదైనా, చేకూరుస్తాను" అని ధైర్యం చెప్పింది; నొక్కి అడిగినది. మిమ్మలరించినగాని అడుగు కదలనని భీష్మించినది. "బాలికామణీ! నా కోరిక అసందర్భము. క్షమింపరాని దోషము. కాముడతి క్రూరుడు, వావి వరుసలు తెలపనీయడు. "బలవానింద్రియగ్రామో, విద్వాంస మపి కర్షతి"కి, నేను ఉదాహరణ. కాముడు దురాసదుడు. అదీ, నా దురవస్థ" అని ఊరుకున్నారు. "ఓహో! గట్టితంటానే! ఐనా, నేర్పుగా సాధించా"లి శీలభంగం కాకుండా, అనృతదోషం అంటకుండా, తప్పించుకురావాలి" అని ఆలోచించుకొని, "గురువర్యా! దీనికి సంశయం అక్కరలేదు. అయితే - నేనిప్పుడు కన్యను. తల్లిదండ్రుల చాటుదానను; స్వతంత్రం లేదు; నాన్నగారితో చెబితే, ముందు మీకు ప్రాణభంగం. తరువాత నన్నేం జేస్తారో...కొన్నాళ్లు తాళండి. కొద్దిరోజులలో నాకు పెండ్లి అవుతుంది; భర్తగారి అదుపు ఆజ్ఞలలో వుంటాను; కార్యం నాటి రాత్రి ఆయన సెలవు పొంది, మీ తావుకు వచ్చి, మీ అభీష్టం నెరవేరుస్తాను. అప్పుడు నాకు ఏ దోషమూ అంటదు; మీ కోరికా నెరవేరుతుంది; ఉభయ తారకంగా ఉంటుంది ... అలాగ అనుగ్రహించి, ఇప్పటికి సెలవిచ్చి పంపండి" అంటే అంతఃపుర ప్రవేశానికి అనుజ్ఞయిచ్చి గురువుగారు భద్రావతిని పంపించారు.

## 2

మహారాజావారి కుల గౌరవ సాంప్రదాయాలకూ, దర్జాకూ అన్నివిధాలా సరిపడ్డ సంబంధం - మరొక మహారాజకుమారునితో రాజకుమారి భద్రావతికి వివాహం నిశ్చయం అయింది; వరుడుకూడా - విద్యావంతుడు, స్ఫురద్రూపి, బుద్ధిమంతుడూ, రాజయోగ్యములైన శస్త్రాస్త్ర ధనుర్విద్యలన్నీ అభ్యసించిన పరాక్రమశాలి; విద్యా సంస్కార సౌరభాలతో, ప్రీతిపాత్రుడుగా ఉన్నాడు. జనకుడూ, దశరథుడూ వియ్యం అందినట్లు, మహారాజులు సంబంధాలు కలుపుకున్నారు. వివాహం చూచినవాళ్లంతా, పెండ్లి సలక్షణంగా జరిగిందనీ, సీతారాముల కల్యాణం లాగ సకల ప్రమోదకరంగా ఉందనీ శ్లాఘించారు.

అడుతీర్చాలని శుభముహూర్తం నిర్ణయించి, శోభనంచేసి కులాచార ప్రకారం నూతన దంపతులను శయనమందిరంలో ప్రవేశపెట్టేరు. సంపూర్ణ యౌవనవతి, చక్కని చుక్కను - భార్యను చూచి భర్త ఉప్పొంగుతున్నాడు - కాని ఎంత లాలించి పిలిచినా, తలవంచుకొని, జాలిగా నిలబడినదికాని, అనుకూలంగా భర్తను అలరించలేదు. ఆమెకు గురువుగారు ఎదుట కనబడుతున్నారు. గుండె బరువుగాఉన్నది - తేలిక లేదు. తన మనస్సులోమాట ఆయనకు ఎలా చెప్పవలెను? విని వారేమందురో? కొంపదీసి - శీలం శంకిస్తే భవిష్యత్తు భగ్నమూ- పాడూ కాకతప్పదు. బుద్ధిమంతుడు - హనుమంతుడు చెప్పినట్లు- నేను కామించి పాపచింతతో గురువును కోరలేదు; శరీర సౌఖ్యంకోసం అతనిపొందు వాంఛించలేదు. నా నైర్మల్యం హనుమత్సమేతులు సీతారాములే ఎఱుగుదురు. వారే నన్ను అనృతదోషం అంటకుండా, శీలభంగం వాటిల్లకుండా రక్షించగలవారు" అనుకునేసరికి ఒక్కమారు ఉత్సాహం పొంగింది; వధువు భర్తపాదాల


# మలబద్ధకము

## మిమ్ము క్రుంగదీయుచున్నదా?




బ్రూక్‌లాక్స్
మిమ్ము రాత్రికి రాత్రి
సరిదిద్దును

మద్రాసు-1.
బ్రాంచి: 17/117, నాగేశ్వర
రావురోడ్, విజయవాడ-2.

# ★ ఆ గజదొంగ ఎవరు? ★

మీద వ్రాలినది. వ్రాలిన ముద్దుగుమ్మను భర్త ఎంతో ప్రేమతో ఎత్తి, లేవదీసి, హృదయమునకు అత్తుకొని, తలనిమిరి, బుగ్గలంటి చుబుకము పైకెత్తి, కండ్లలోనూటిగా చూసూ "ప్రేమా? నీమనస్సు స్థిమితములేక సంక్షోభిస్తున్నది; నీకేమి కావలసినా అడిగి పుచ్చుకో; ఇస్తాను; గుండెపదిల పర్చుకో, నీవు సుఖించి నాకు సుఖమివ్వు" అన్నాడు. ఆమె చేతులు జోడించి, వివాహాత్పూర్వము గురునితో తాను చేసుకొనిన నిర్ణయము నెఱవేర్చి, అనృత దోషము అంటకుండ రక్షింప వేడుకొన్నది. ఆమె హృదయ నైర్మల్య, ధారాళ ప్రసంగములకు ప్రీతుడై "సత్యవతీ! వెళ్లు! గురుని ప్రీతునిచేసి, నీవు ధన్యవై నన్ను ధన్యుని చేయు"మని అనుజ్ఞ యిచ్చాడు.

సమస్తాభరణములు ధరించి, నిలుకడగన్న మెఱుపులాగున, ఘల్లు ఘల్లుమనుచు నడచి వచ్చు నా సతీమణిని చూచి, చోరులడ్డుపడిరి. అడ్డి, ఆపి, నిలిపి "ఆగు! మేము దొంగలము! నీ ఆభరణములన్నీ ఒల్చి ఇక్కడపెట్టి, మరి కదులు" అని గర్జించారు. రాజకుమారి ఏమీ సంకోచించలేదు. "అన్నలారా! నేను పుట్టినప్పుడు నాతో ఈ అలంకారములు తేలేదు. పోయేటప్పుడు ఇవేవీ - ఆఖరుకు ఒక పుచ్చిన వక్కైనా - నాకూ డారావు. జగన్నాటకంలో మూడురోజుల మధ్యాన్నం బ్రతుకులో - ఎప్పుడు, ఎక్కడ ఎవరికి ఏది రావాలో అదివస్తుంది; ఏది పోవాలో అది పోతుంది - వచ్చినప్పుడు సంతోషంతో పొంగావద్దు పోయేటప్పుడు దుఃఖపడి యేడవావద్దు - నాకు మీరు ఇవితీసుకుంటారని విచారంఏమీ లేదు - నేను పూర్వం చేసిన ఖరారుప్రకారం, గురువుగార్ని సంతోషపెట్టాలని వెళుతున్నాను. అందుకు నా ప్రాణేశ్వరులను మతించారు. దీపపు సెమ్మెలాగ అలంకారాలు లేకుండా వెళితే బాగుండదు; రెండడుగులు వెళ్ళి గురువు అభిలాష తీర్చి, ఈదారినే వచ్చి నా మంగళసూత్రం, కుత్తుకంటు, చెవులకమ్మలూ - ముక్కు అడ్డబాస, చేతుల కంకణాలు - కాళ్ళ అందెలూ - ఐదువ మాంగల్య లక్షణాలు తప్ప తక్కిని జవాహిరీ అంతా మీరు తీసుకోండి" అన్నది.

ఆమెమాటలు విని చోరులు మరేమీ మారు చెప్పలేకపోయారు - "అలాగే! వెళ్ళిరా, అమ్మా!" అన్నారు.

రాజకుమారి ఝుణ ఝుణాత్కారాలతో గురువుగారింటికి వెళ్ళి తలుపుపిలిచిలేపి "గురువర్యా! సద్భావులైన నాభర్తగారు మీ కూటమి నంగీకరించి నన్ను పంపించినారు. మీరు మీ అభీష్టము నెరవేర్చుకొని నన్ను త్వరలో తిరిగి పంపండి; నేడు మా శోభనపు రాత్రి; వారు నాకొఱకు ప్రతీక్షిస్తూ వుంటారు" అని త్వరపెట్టినది. గురువుగారు దిగ్భ్రమచెంది, "అమ్మా! లోగడ నాకు దుర్బుద్ధి పుట్టి నీ సమాగమము వాంఛించిన సంగతి నిజమే. కాని తరువాత, పుత్రికాసమానురాలవు, శిష్యురాలవు నైన నిన్ను కూడుట మహాద్రోహము - ఘోర పాపమని పశ్చాత్తాప పడుచున్నాను - నీవు నాకు ఆడపడుచువు. పసుపు, కుంకుమ, పండ్లు ఫలములు, చీరె, సారె, వస్తువాహనములు పెట్టి నిన్ను ఆశీర్వదించి పంపుదామన్న ఆలోచన తప్ప నాకు పాపాసక్తి లేదు. శోభన పరంపరా ప్రాప్తిరస్తు; పుత్ర పౌత్రాభి వృద్ధిరస్తు; సౌభాగ్యవతీ భవ" అని ఆశీర్వదించి వీడ్కొలిపెను.

బ్రతుకుజీవుడా అనుకొని రాజకుమారి తొందరగా అడుగులు వేయుచు చోరగృహమున నడుగు పెట్టింది.

## 3

"రండి! అన్నలారా! చప్పున రండి! మీకిచ్చేస్తానన్న ఆభరణాలు త్వరగా తీసుకోండి! గురువుగారు నన్ను పుత్రికాప్రాయంగా చూచుకొని, నన్నుమన్నించి, చీర - సారె - పసుపు కుంకుమ, పండ్లు ఇచ్చి వీడ్కొల్పినారు. ఈ రాత్రి మా శోభనపు రాత్రి; భర్తగారు నాకోసం ప్రతీక్షిస్తున్నారు. చప్పున రండి! మీ వస్తువులు మీరు తీసుకొని నన్ను పంపించండి" అని కంటె, ఒడ్డాణము, కాసులపేరు — చంద్రహారములు ... చప్పచప్పున తీసిపెట్టి "రండి! రమ్మని దొంగలను తొందర చేస్తున్నది.

దొంగలు అడ్డగించినప్పుడు— లోకంలో



రోజూ హోటలు భోజనం చేస్తూ, పదార్థాలేమీ బావుండక విసుగెత్తి పోయిన ఒక ఆసామీ ఒకరోజున సర్వరుతో ఇలా అన్నాడు: "నేను చాలరోజుల్నించీ చూస్తున్నాను, ఆ మూల కూర్చున్న పెద్దమనిషికి మంచి మంచివన్నీ వడ్డిస్తున్నారు. నాకుచల్లారి పోయినవీ, ఉడికీ ఉడకనివీ పడేస్తున్నారు. ఏమిటీ అన్యాయం? నేను మేనేజరుతో చెప్పదలచుకున్నాను"

"మంచిదిసార్," అన్నాడుసర్వర్.

"మీ మేనేజరెక్కడుంటారు?"

"ఆమూల కూర్చున్నాయనేసార్," అన్నాడు సర్వర్.

స్త్రీలు గోలుగోలున యేడ్చుచుందురేగాని రండి, తీసుకోండి అని దొంగలనే త్వరపెట్టే స్త్రీరత్నమును ఇంతవఱకు దొంగలు చూచి లేరు—ఇటుపైన చూడరు. ఈ వింతకు దొంగలుకూడ నిశ్చేష్టులై నిలిచి "ఈమె, మానవ స్త్రీ కాదు. ఏదో దేవత, కనకదుర్గ" అని భావించి, "తల్లీ! నీవు మాకుకూడా ఆడపడుచువే! నీ సొమ్ములు మా కేమీవద్దు, నీవే ఉంచుకో! అని పసుపు కుంకుమతో అరటిపండ్లు ఆభరణములు ఆమెకు సంచితో చేతి కందిచ్చి "తల్లీ! ఇవి తీసుకొని, సంతోషించు! నీ సంతోషము మాకు జయము" అని యామెను వీడుకొల్పిరి.

వాయువేగ మనోవేగాలతో ఆమెకోట ఉత్తరపు మెట్టవంక నడిచి, తొందరగా మెట్లెక్కి, శోభనపుగదిలో ప్రవేశించి, తలుపు గడియవైచి, ఆనంద బాష్పములు రాల భర్తగారి పాదములకు నమస్కరించినది. "దేవా! ప్రాణేశ్వరా! తమకు నాయందుగల ప్రేమ, విశ్వాస గౌరవములు అపూర్వములు. కాబట్టి మనకు సర్వస్వమైనది. మీరు తప్ప, లోకములో, ఏ శోభనపు పెండ్లికొడుకు, ప్రథమసమాగమం వేళ—తన భార్యను నమ్మి—పర పురుషసమాగమానికి కూడా ఒప్పుకొని ఇలాగ పంపిస్తాడు? భగవత్కృపవల్ల—శీలభంగం కాకుండా, సత్యవ్రతం చెడకుండా—ప్రాప్తి ఫలముతో సత్రి దక్కినది — హనుమత్సమేత సీతారాములను నమ్మి చెడినవా రెవరూ లేరు" అని ఉభయులూ—ఇష్ట దేవతలకు మ్రొక్కి, ఆనంద బాష్పాలు రాలుస్తూ, ఒకళ్ళొకళ్ళ కౌగిళ్ళలో పెనవేసుకొన్నారు—పురుషోత్తము కరస్పర్శతో గజేంద్రుని శరీరం సుఖపడ్డట్టు, స్వకీయ పురుషస్పర్శతో భద్రావతి దేహ మనోరుజలన్నీ మాయమయినవి! ఎంత బాధ పడ్డదో ఆమె అంతసుఖించినది ఆమె చిత్ర కథ విన్నవాళ్లు కూడా "హాయి హాయి!" అని మెచ్చుకున్నారు."

## 4

"సోదర సోదరీ మణులారా! పూజ్య సభాసదులారా!

మీరు ఇప్పుడు పుణ్యశ్లోకులైన నలుగురు మానవుల చరిత్ర విన్నారు. పైని వివరించినది యదార్థంగా జరిగిన కథ గాని, నేను కల్పించి చెప్పిన కథ కాదు.

అయితే ఈ నలుగురిలో, బాగా విమర్శించి, ఆలోచించి చూడగా, ఉత్తమోత్తమము, మిక్కిలి శ్లాఘ్యము అయిన పాత్ర యెవరిదని మీ మనస్సుకు అనుకుంటుందో, వారి పేరు వ్రాసి, దిగువ మీ సంతకం చేసి, మీకు ఇప్పుడే అందజేసే తెల్లకాగితంమీద లిఖించండి. మీ అభిప్రాయములకు హేతువులనుకూడా, ఇష్టమైనవారు 1-2 వాక్యములలో సంగ్రహంగా ఉగ్గడించవచ్చును. సభాభిప్రాయప్రకారం ఉత్తమమైన విమర్శకు ఒక లక్ష రూపాయిల వఱకూ బహుమతి కూడా లభించవచ్చును" అని కూడా కథకుడు, రాజానుమతిని ప్రకటించెను.

సభలో ఒక్కొక్కరికి పావుటావు—పావుటావు చొప్పున తెల్లకాగితములును, వ్రాయుటకు లేఖినులును అందియ్యబడినవి "ప్రక్కవారిని, పైవారిని అడగకుండా ఎవరికి స్వయంగాతోచిన అభిప్రాయం వారే వ్రాయవలసిన"దనికూడా సభికులకు విన్నవింపబడినది.

సభికులలో స్త్రీలు రెండువందల ఏబది మంది ఉన్నారు - వాళ్ళందరూ - రాజపుత్రిక - భద్రావతి - శీలము ఉత్తమోత్తమమైనదనీ-అద్భుతమనీ ప్రశంసించి వ్రాశారు.

మగసభికులలో కాలముగడిచిన వృద్ధులంతా గురుశీలమును మెచ్చి ప్రశంసించారు. ఆప్రకారమే వ్రాసియిచ్చారు. ఆ సమ్మతుల సంఖ్యకూడా—250 య్యే. యువక సభికులందరూ భర్తపాత్రను మెచ్చుకొని ప్రశంసించి వ్రాశారు. ఈవిధంగా 750 అభిప్రాయాలు వ్రాయబడ్డవి - భర్తప్రశంస, భార్యప్రశంస, గురుప్రశంస, అన్నీ సంఖ్యలో సరిసమానంగా వున్నవి

మరొక్క కాగితము మిగిలినది - అది రాజకుమారుల్లో మధ్యవాడు వ్రాసి యిచ్చినది. ఈ కథలో మిక్కిలి ప్రశంసింపతగినవారు చోరులు. ఏమంటే చేతికందిన సొమ్ములూ-ఆభరణాలూ ఏ చోరుడూ విడిచిపెట్టలేదు-కథలో వీళ్ళు విడిచిపెట్టారంటే అది లోకోత్తరమున్నూ, మిక్కిలి ప్రశంసాపాత్రమున్నూ; కనుక నేను వాళ్ళని మెచ్చుకుంటాను" అని సేఖువు వ్రాశాను.

సభలోనుంచి ఎవరూ కదలకూ పెదవి రాజభటులు గంభీరంగా ఉరిమి రాజాజ్ఞ కోసం ప్రతీక్షిస్తున్నారు. మహారాజావారూ, న్యాయాధీశుడూ, మంత్రి కొత్వాలు - మంతనం చేశారు

పిమ్మట న్యాయాధీశుడు తన స్థానం అలంకరించి, రాజకుమారులలో మధ్యవానిని పిలిచి, ఇలాగన్నాడు: "రాజకుమారా! దొంగలూ, దోషులూ ప్రకృతి బద్ధులైన మానవులు కావటంచేత, తమ దోషములను తామే ప్రకటించుకొని దొరికిపోతారు. చిత్రం ఏమిటంటే తమ నేరము తామే బయట పెట్టి ప్రకటించుకుంటున్నామని గ్రహించుకోలేరు. ఈ విషయమే శ్రీకృష్ణభగవానులు భగవద్గీత కడపటి శ్లోకాలలో చమత్కారంగా సెలవిచ్చారు. "స్వభావజేన కౌన్తేయ నిబద్ధస్స్వేన కర్మణా। కర్తుం నేచ్ఛసి యన్మోహాత్ కరిష్యస్యవశోపి తత్." ఎంత మరుగున దాచినా, ఎలకను చూస్తూనే పిల్లిపసిగట్టక మానదు

ఏ తావాతా, నీ నైజం నీ చేత చోరులను శ్లాఘింపచేసినది; రాజముద్రిక అపహరించినవాడవు నీవే! ఆర్భాటములు అక్కర లేకుండా—మర్యాదగా—రాజముద్రిక ఇచ్చివేసి రాజ్యపరిపాలనకు తోడ్పడుమని నిన్ను కోరుతున్నాము."

అని న్యాయాధీశుడనగా—ఆ రాజకుమారుడు, చిఱునవ్వు నవ్వి, జేబులోనుండి రాజముద్రికను తీసి, న్యాయాధీశునకు అందిచ్చాడు. అల్లరులు, చికాకులు లేకుండ ముద్రిక చేతికి వచ్చినందుకు మిక్కిలి సంతోషించి, మహారాజావారు కథకుని మిక్కిలి ప్రశంసించి వేయిన్నినూట పదహార్లు, దుశ్శాలువలు ఇచ్చి బహూకరించిరి.

ఈ గజదొంగ వ్యవహార మింత సులభముగా తేల్చినందుకు ముఖ్యులైన రాజకీయోద్యోగులు ఒక్కొక్కరు నూట పదార్లిచ్చి కథకుని గౌరవించారు. ★




నారసింహ లేహ్యము


బంగారుతో చేరినది. మేహము రక్తాశ, నిస్సత్తువ వగైరా హరించి బలము రక్తవృద్ధి కలిగించును 20రో. డబ్బీ రు. 3-4-0 పోస్టేజి రు 1-1-0
ఎ. పి. ఎ. అండ్ కో. (ఆయుర్వేద సమాజం)
పెరిదేపి (పోస్టు) — నెల్లూరు జిల్లా,